ఆకాశవాణి హైదరాబాద్ కేంద్రం

జాతీయ వార్తా విభాగం

జాతీయ వార్తలు

తేదీ: 02.10.2024 సమయం 19.05 గంటలు

ముఖ్యాంశాలు

1. జాతిపిత మహాత్మాగాంధీ, మాజీ ప్రధానమంత్రి లాల్ బహదూర్ శాస్త్రి జయంతిని ఈరోజు జరుపుకున్నారు. రాష్ట్రపతి ద్రౌపదీముర్ము, ప్రధానమంత్రి నరేంద్రమోదీ శ్రద్ధాంజలి ఘటించారు.
2. జాతిపిత మహాత్మాగాంధీ ఆశయాలను ప్రధానమంత్రి నరేంద్రమోదీ అనుసరిస్తున్నారని గాంధీజీ మనుమరాలు సుమిత్రా గాంధీ కులకర్ణి ప్రశంసించారు.
3. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఈరోజు ఝూర్ఖండ్ పర్యటనలో భాగంగా హజారీబాగ్ లో సుమారు 83,300 కోట్ల రూపాయల విలువైన పలు పథకాలకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు.
4. ఇరాన్ క్షిపణి దాడి నేపథ్యంలో ఐక్యరాజ్యసమితి ప్రధాన కార్యదర్శి యాంటోనియో గుటెరస్ ఇజ్రాయెల్ లో ప్రవేశించకుండా నిషేధించినట్లు ఆ దేశ విదేశాంగ మంత్రి ఇజ్రాయెల్ కార్ట్జ్ వెల్లడించారు.

--------

**GANDHI**

జాతిపిత మహాత్మాగాంధీ, మాజీ ప్రధానమంత్రి లాల్ బహదూర్ శాస్త్రి జయంతిని ఈరోజు జరుపుకున్నారు. దేశవ్యాప్తంగా, విదేశాలలోని రాయబార కార్యాలయాలలోనూ ఈ సందర్భంగా పలు కార్యక్రమాలు జరిగాయి. ఢిల్లీలోని బాపూజీ సమాధి రాజ్ ఘాట్ వద్ద సర్వధర్మ ప్రార్థనా సమావేశం జరిగింది. రాష్ట్రపతి ద్రౌపదీముర్ము, ప్రధానమంత్రి నరేంద్రమోదీ

జాతిపిత మహాత్మాగాంధీకి, మాజీ ప్రధానమంత్రి లాల్ బహదూర్ శాస్త్రికి శ్రద్ధాంజలి ఘటించారు. దేశానికి ఆ మహనీయులు చేసిన సేవలను గుర్తు చేసుకున్నారు. వివిధ రాష్ట్రాలలో ఈ సందర్భంగా ప్రత్యేక కార్యక్రమాలు జరిగాయి.

హైదరాబాద్ లోని బాపూఘాట్ వద్ద రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ , ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బాపూజీకి నివాళులర్పించారు.

## PM – SWACHHATA HI SEVA

తమ జీవితాల్లో స్వచ్ఛతను అంతర్భాగం చేసుకుంటామని ప్రతిజ్ఞ చేయాలని ప్రధానమంత్రి నరేంద్రమోదీ ప్రజలను కోరారు. స్వచ్ఛతకు జీవితకాలన నిబద్ధులై ఉండాలని, ఒకసారి చేసి వదిలేయవద్దని అన్నారు. కొత్త ఢిల్లీలో స్వచ్ఛభారత్ మిషన్ 10 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా ప్రధానమంత్రి ఒక కార్యక్రమంలో మాట్లాడుతూ స్వచ్ఛభారత్ ను సంపూర్ణంగా ఆచరించడానికి నిరంతరం కృషి చేయవలసి ఉందని అన్నారు. స్వచ్ఛతను ఒక ప్రజా ఉద్యమంగా మలచిన 140 కోట్ల మంది ప్రజల అచంచల స్ఫూర్తిని ఆయన కొనియాడారు. ప్రజలు, పారిశుద్ధ్య సిబ్బంది, మత నాయకులు, క్రీడాకారులు, వివిధ రంగాల ప్రముఖులు, ఎన్జీవోలు, మీడియా సిబ్బంది అందరూ కూడా స్వచ్ఛభారత్ మిషన్ ను విజయవంతం చేశారన్నారు. ఈ సందర్భంగా ప్రధానమంత్రి పారిశుద్ధ్యం, స్వచ్ఛతకు సంబంధించిన 9 వేల 600 కోట్ల రూపాయల ప్రాజక్టులను ప్రారంభించారు. ఈ ప్రాజెక్టుల్లో అమృత్, అమృత్ 2వ దశ, జాతీయ స్వచ్ఛగంగా మిషన్, గోబర్ ధాన్ పథకం కింద 15 కంప్రెస్డ్ బయోగ్యాస్ ప్లాంట్ లు ఉన్నాయి.

## Swatchhata Hi Seva –Delhi

పలువురు కేంద్ర మంత్రులు, వివిధ పక్షాలకు చెందిన ఇతర నాయకులు ఈరోజు ఢిల్లీలోని పలు ప్రాంతాల్లో స్వచ్ఛత అభియాన్ చేపట్టి జాతిపిత మహాత్మా గాంధీకి శ్రద్ధాంజలి ఘటించారు. బిజెపి జాతీయ అధ్యక్షుడు, కేంద్ర మంత్రి జేపీ నడ్డా ఈ సందర్భంగా విలేకరులతో

మాట్లాడుతూ మహాత్మా గాంధీ పిలుపునిచ్చిన పరిశుభ్రత కార్యక్రమాన్ని ప్రభుత్వం ప్రజా ఉద్యమంగా మలచిందని పేర్కొన్నారు. దేశాన్ని పరిశుభ్రంగా ఉంచడం ద్వారా సుఖ సంతోషాలు పంచేందుకు సంఘటితంగా కృషి చేయాలని నడ్డా ప్రజలకు విజ్ఞప్తి చేశారు. కృషి భవన్ లో పశుసంవర్ధక, మత్స్య శాఖ మంత్రి రాజీవ్ రంజన్ సింగ్ శ్రమదానంలో పాల్గొన్నారు. ప్రధానమంత్రి కార్యాలయ సహాయ మంత్రి డాక్టర్ జితేంద్ర సింగ్ నెహ్రూ పార్క్ వద్ద స్వచ్ఛత హీ సేవా కార్యక్రమంలో పాల్గొన్నారు.

**KULKARNI- MODI**

జాతిపిత మహాత్మాగాంధీ ఆశయాలను ప్రధానమంత్రి నరేంద్రమోదీ అనుసరిస్తున్నారని గాంధీజీ మనుమరాలు సుమిత్రా గాంధీ కులకర్ణి ప్రశంసించారు. ఒక ఆంగ్ల దినపత్రికలో రాసిన వ్యాసంలో ఆమె మోదీ ప్రధానమంత్రి పదవిని అధిష్టించిన తర్వాత తమ స్వాతంత్ర్య దినోత్సవ సందేశంలో జాతీయ పరిశుభ్రతా ఆవశ్యకత గురించి మాట్లాడారని అన్నారు. ఆయన ప్రారంభించిన స్వచ్ఛ భారత్ అభియాన్ ద్వారా దేశవ్యాప్తంగా పరిశుభ్రత పెరిగిందని, మహిళల భద్రతా గౌరవం పెరిగాయని సుమిత్రా గాంధీ కులకర్ణి తెలిపారు. సుస్థిర సామాజిక మార్పు ప్రజా ఉద్యమం ద్వారానే సాధ్యమని మహాత్మాగాంధీ విశ్వసించేవారని, మోదీ అదే మార్గంలో సబ్ కా సాథ్ – సబ్ కా వికాస్, సబ్ కా విశ్వాస్, వికసిత్ భారత్ కార్యక్రమాలను దృఢంగా కొనసాగిస్తున్నారని అన్నారు.

**PM-Jharkhand.**

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఈరోజు ఝార్ఖండ్ పర్యటనలో భాగంగా హజారీబాగ్ లో సుమారు 83,300 కోట్ల రూపాయల విలువైన పలు పథకాలకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. 79,150 కోట్ల రూపాయలు ఖర్చయ్యే ధర్తీ జన జాతీయ గ్రామ ఉత్కర్ష అభియాన్, ప్రధానమంత్రి జనజాతి ఆదివాసి న్యాయ మహా అభియాన్ పథకాలు ఇందులో ఉన్నాయి. 40

ఏకలవ్య పాఠశాలల్ని ప్రధానమంత్రి ప్రారంభించారు. మరో 25 ఏకలవ్య పాఠశాలల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా హజారీబాగ్ లోని వినోబా భావే విశ్వవిద్యాలయ ప్రాంగణంలో జరిగిన సభలో ప్రధానమంత్రి  మాట్లాడుతూ ఝార్ఖండ్లో గ్రామీణ మౌలిక సదుపాయాలను పెంపొందించడానికి, గిరిజన ప్రజలకు సాధికారత కల్పించడానికి చేస్తున్న కృషిలో భాగంగా గణనీయమైన రీతిలో పలు పథకాలు చేపడుతున్నట్లు తెలిపారు. గిరిజన ప్రజల సాధికారత జరగనిదే భారతదేశ అభివృద్ధి స్వప్నం సాకారం కాదని మోడీ స్పష్టం చేశారు. ఈ పథకాల వల్ల సుమారు 5 కోట్ల మంది గిరిజన ప్రజలకు లబ్ధి కలుగుతుందని తెలిపారు. తమ ప్రభుత్వ కార్యక్రమాలలో గిరిజనుల సంక్షేమం అగ్రభాగాన ఉంటుందని పేర్కొన్నారు.

## WHO -SWACH BHARAT MISSION

స్వచ్ఛభారత్ మిషన్ ద్వారా సుస్థిర అభివృద్ధి లక్ష్యాల సాధనలో ప్రభుత్వం చేస్తున్న విశేష కృషి పట్ల ప్రపంచ ఆరోగ్య సంస్థ డైరక్టర్ జనరల్ టెడ్రోస్ అధనాన్ గేబ్రియాసిస్ ప్రధానమంత్రి నరేంద్రమోదీని ప్రశంసించారు. పరిశుభ్రత నెలకొల్పి ఆరోగ్యకరమైన దేశంగా మలచేందుకు స్వచ్ఛభారత్ కార్యక్రమం ప్రజలను భాగస్వాములను చేస్తున్నదని ఆ ప్రకటనలో తెలిపారు.

## ISRAEL-BAN-UN SECY. GEN.

ఇజ్రాయెల్ లోకి ప్రవేశించకుండా ఐక్యరాజ్యసమితి ప్రధాన కార్యదర్శి యాంటోనియో గుటెరస్ ను నిషేధించినట్లు ఆ దేశ విదేశాంగ మంత్రి ఇజ్రాయెల్ కార్జ్ వెల్లడించారు. ఇజ్రాయెల్ – ఇరాన్ ల మధ్య ఇటీవలి దాడుల నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నారు. ఇరాన్ దాడిని ఖండించనివారికి తమ దేశంలో ప్రవేశించే అనుమతి లేదని  ఆయన స్పష్టం చేశారు. ఐక్యరాజ్యసమితి చారిత్రక సందర్భంలో గుటెరస్ చర్యలు, ప్రకటనలను తీవ్రంగా వ్యతిరేకిస్తున్నట్లు ఇజ్రాయెల్ విదేశాంగ మంత్రి తెలిపారు.

కాగా మంగళవారం రాత్రి ఇజ్రాయెల్ పై ఇరాన్ క్షిపణి దాడి నేపథ్యంలో చేసిన వ్యాఖ్యల దరిమిలా ఇజ్రాయెల్ విదేశాంగ మంత్రి ఈ నిర్ణయం ప్రకటించారు.

## REV. POLICE-CARTEL BUSTED

ఢిల్లీ పోలీసులు ఈరోజు ఒక అంతర్జాతీయ మాదక ద్రవ్యాల ముఠాను పట్టుకుని 2 వేల కోట్ల రూపాయలు విలువ చేసే 500 కిలోల కొకైన్ ని వారి నుంచి స్వాధీన చేసుకున్నారు. దేశ రాజధాని మెహరౌలీ ప్రాంతంలో పోలీసులు నలుగురిని అరెస్టు చేశారు. 562 కిలోల కొకైన్, 40 కిలోల మారిజువానా మత్తుపదార్థాలు స్వాధీనం చేసుకున్నట్లు ప్రత్యేక విభాగం అదనపు పోలీస్ కమీషనర్ ప్రమోద్ కుష్వా తెలిపారు. ఇటీవలి కాలంలో ఢిల్లీలో మొదటిసారిగా ఇంత అధిక మాదకద్రవ్యాలను స్వాధీనం చేసుకున్నట్లు ఆయన తెలిపారు.

### PM-eAction Date

ప్రధానమంత్రికి పలు సందర్భాల్లో బహూకరించిన కానుకల ఈ వేలం గడువు ఈరోజు ముగియవలసి ఉండగా ఈనెల 31 వరకు పొడిగించారు.ఈ కానుకలను ఈ వేలం ద్వారా విక్రయించగా వచ్చే మొత్తాన్ని నమామి గంగా నిధికి కేటాయించడం జరుగుతుందని, అందువల్ల ప్రజలు పెద్ద సంఖ్యలో ప్రధాని కానుకల ఈ వేలంలో పాల్గొనాలని అధికార ప్రకటనలో కోరారు. అధికారిక వెబ్సైటు పీఎం మెమెంటోస్ డాట్ జివో వి డాట్ ఇన్ లో ఆసక్తి కలిగిన వారు తమ పేర్లను నమోదు చేసుకోవాలని ఆ ప్రకటన వివరించింది.

### PM -Mahalaya

ఈరోజు మహాలయ అమావాస్యను పురస్కరించుకొని ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. దుర్గ పూజ రేపటి నుంచి జరుగుతుందని సర్వత్రా సానుకూల వాతావరణం, సద్భావన పరిఢవిల్లాలని ఆకాంక్షించారు. అందరికీ దుర్గామాత సుఖ సంతోషాలు ఆయురారోగ్యాలు ప్రసాదించాలని మోదీ కోరుకున్నారు.

**JAMAICA PM**

జమైకా ప్రధానమంత్రి ఆండ్రూ హోల్నెస్ ఈరోజు వారణాసిలో పర్యటించారు. బుద్ధుడు మొదటిసారిగా బోధనలు జరిపిన సారనాథ్ ను ఆయన సందర్శించారు. ఆయన వెంట గవర్నర్ ఆనందీబెన్ పటేల్, రాష్ట్ర ఆర్థికమంత్రి సురేష్ ఖన్నా ఉన్నారు. ఈ సాయంత్రం గంగా హారతిని కూడా ఆయన వీక్షిస్తున్నారు.

**MEA – TRAVEL ADVISORY**

అవసరమైతే తప్ప ఇరాన్ కు వెళ్ళవద్దని  విదేశాంగశాఖ భారత పౌరులకు సూచించింది. ఇరాన్ లో తాజా పరిస్థితుల పట్ల అప్రమత్తంగా ఉండాలని, ఆ దేశంలో ఉన్న భారతీయులకు సూచిస్తూ టెహరాన్ లోని భారత రాయబార కార్యాలయంతో సంప్రదిస్తూ ఉండాలని, వారిని విదేశాంగశాఖ కోరింది.